రాష్ట్రమంతా క్రాప్ హాలిడే!

శనివారం ఎర్రమంజిల్‌లోని జలసౌధలో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఎవుసానికి నీళ్లివ్వలేం

- బరాజ్‌లలో నీళ్లు లేకనే.. రైతులు అర్థంచేసుకోవాలి
- ఏడాది చివరి నాటికి 5 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు
- కర్ణాటక నుంచి 10 టీఎంసీలు కృష్ణా నీటిని కోరుతున్నాం
- సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- సీనియర్ అధికారులతో నీటిపారుదల శాఖపై సమీక్ష

హైదరాబాద్, జనవరి13 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టు కింద మొత్తంగా 18 లక్షల స్థిరీకరణ ఆయకట్టు ఉన్నదని, అయితే ఈ ఏడాది బరాజ్‌లలో నీటినిల్వలు లేకపోవటంతో పంటలకు పూర్తిస్థాయిలో నీరివ్వలేకపోతున్నామని సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థిరీకరణ ఆయకట్టులో ఈ యాసంగి సగానికిపైగా తగ్గే అవకాశమున్నదని చెప్పారు. నీటి పారుదలశాఖ ఉన్నతాధికారులతో ఎర్రమంజిల్‌లోని జలసౌధలో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియా ప్రతినిధుల సమావేశంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ఎస్సారెస్పీ స్టేజ్-2తో కలిపి మొత్తంగా 18 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నదని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కాళేశ్వరం ప్రాజెక్టు ఈ ఏడాది అందుబాటులో లేకుండాపోయిందని ఆరోపించారు. ప్రస్తుతం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో నీటి నిల్వలు అడుగంటాయని తెలిపారు. ఈ నేపథ్యంలో స్థిరీకరణ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరివ్వలేకపోతున్నామని పేర్కొన్నారు. రైతులు కూడా ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని కోరారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆయకట్టు

ఏడాది చివరి నాటికి దాదాపు 5 లక్షల ఎకరాల్లో కొత్త ఆయకట్టును సృష్టించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కొత్త ఆయకట్టును వేగంగా ఏర్పాటు చేయగల ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తామని, 6 నెలలు, సంవత్సరంలోపు కొత్త ఆయకట్టును సృష్టించగల ప్రాజెక్టులను గుర్తించామని చెప్పారు. ఆ లక్ష్యాన్ని సాధించే ప్రాజెక్టులపై ఖర్చును పెంచాలని నిర్ణయించినట్టు తెలిపారు. డిసెంబర్ 2024 నాటికి 4.5 నుంచి 5 లక్షల ఎకరాల్లో కొత్త ఆయకట్టులను సృష్టించడం తమ లక్ష్యమని చెప్పారు. అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని ఉత్తమ్ కుమార్‌రెడ్డి పునరుద్ఘాటించారు.

కర్ణాటకను నీళ్లు అడుగుతాం

ప్రస్తుతం కృష్ణాబేసిన్‌లో తీవ్ర నీటి కొరత ఉన్నదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు కోయినా నుంచి నీరివ్వాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు. నీటికి బదులుగా ఆ మేరకు కరెంటిస్తామని హామీ ఇస్తున్నామని చెప్పారు. కొయినా నుంచి మొత్తంగా 100 టీఎంసీల నీటిని అడగాలని భావిస్తున్నట్టు చెప్పారు. తాగునీటి అవసరాలు తీర్చడానికి ఆల్మట్టి నుంచి 10 టీఎంసీల నీటిని ఇవ్వాలని కర్ణాటక ప్రభుత్వాన్ని కూడా కోరనున్నామని వెల్లడించారు. కృష్ణా నీటిని కోరేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం కర్ణాటకలో పర్యటించనున్నదని వివరించారు.

మొదటిపేజీ తరువాయి...

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తేల్చేశారు. ఇప్పటికే కృష్ణాబేసిన్‌లో నీటి కొరత కారణంగా మొత్తంగా క్రాప్ హాలిడే ప్రకటించగా, ఇప్పుడు గోదావరి బేసిన్‌లోనూ సాగునీరందడంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

నీటి నిల్వల్లో పెద్ద తేడా లేకున్నా..

గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టుల్లో గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే నీటినిల్వల్లో 6 టీఎంసీలే తక్కువ ఉన్నాయి. అయినప్పటికీ ఈ ఏడాది పూర్తిస్థాయిలో సాగునీరిచ్చేందుకు ప్రభుత్వం జంకుతున్నది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద దాదాపు 11.55 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వాలని సాగునీటి ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఎస్సారెస్పీ ప్రాజెక్టు నీటి నిల్వసామర్థ్యం 90 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 63.19 టీఎంసీల నీరు ఉన్నది. 6.50 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాలకు కేటాయించారు. మిగతా నీటిని యాసంగి సాగునీటి అవసరాలకు కేటాయించారు. ఈ నేపథ్యంలో ఎస్సారెస్పీ స్టేజ్ -1 కింద మొత్తంగా 9,65,013 ఎకరాలు ఉండగా, దాదాపు లక్ష ఎకరాల ఆయకట్టును తగ్గించి, 8,28,297 ఎకరాలకు మాత్రమే సాగునీరివ్వాలని నిర్ణయించారు. అందులో 3.87 ఎకరాలు ఆరుతడి పంటలకు, 4.41 లక్షల ఎకరాలకు తరి పంటలకు సాగునీరివ్వాలని ప్రతిపాదించింది. గత యాసంగి సీజన్‌లో స్టేజ్ -1 కింద ఉన్న మొత్తం 9,68,640 ఎకరాల ఆయకట్టుకు గాను 9,60,000 ఎకరాలకు సాగునీరందించారు. ఎస్సారెస్పీ స్టేజ్- 2 కింద 3,71,691 ఎకరాలు ఉండగా దాదాపు 2 లక్షల ఎకరాలకు తగ్గించారు. ఈ ఏడాది ఇప్పటికే ఎస్సారెస్పీ స్టేజ్-2 కింద దాదాపు 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు కోత విధించారు. కడెంతోపాటు, సదర్‌మాట్ కింద క్రాప్ హాలిడేలను ప్రకటించారు. సింగూరు ప్రాజెక్టు కింద ఆయకట్టును ప్రభుత్వం కొంత మేర తగ్గించింది. నిజాంసాగర్, అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల పథకాల కింద ఆయకట్టును పరిమితం చేసింది. ఇప్పుడు ప్రతిపాదించిన ఆయకట్టుకు సైతం నీరిచ్చే పరిస్థితి లేదని తెలుస్తున్నది.

కాళేశ్వరం లేక కకావికలం

గోదావరి బేసిన్‌లో ప్రస్తుతం ప్రతిపాదించిన ఆయకట్టుకు సైతం పూర్తిస్థాయిలో సాగునీరిచ్చేందుకు ప్రభుత్వం వెనకడుగు వేస్తున్నది. అందుకు కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులో లేకపోవడమే కారణమని స్పష్టమవుతున్నది. కాళేశ్వరం ఎత్తిపోతల లేకముందు ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్ 2వ దశ సూర్యాపేట వరకు.. వరద కాలువ, నిజాంసాగర్ తదితర ప్రాజెక్టులు కింద వానకాలం పంటకే దిక్కులేని దుస్థితి. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఆయా ప్రాజెక్టుల కింద ఆయకట్టు కొత్త జీవం పోసుకొన్నది. రెండు పంటలకు భరోసా లభించింది. ఆయా ప్రాజెక్టుల కింద ఉన్న చివరి మడి వరకు సాగునీరందేలా ప్రణాళికాబద్ధంగా కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలను కొనసాగించింది. కాళేశ్వరం ప్రాజెక్టుతో అనుసంధానమైన ప్రాజెక్టులకు ఎక్కడ నీరు అవసరమైతే అక్కడికి అప్పటికప్పుడు లిఫ్ట్ చేసి అందజేసింది. ఆయా ప్రాజెక్టుల ద్వారా అనుసంధానమైన చెరువుల న్నింటినీ క్రమం తప్పకుండా నింపుతూ వచ్చింది. ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందేలా చూసింది. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు పూర్తిగా అందుబాటులో లేకుండా పోయాయి. బరాజ్‌ల మరమ్మతుల కోసం నీటిని దిగువకు విడుదల చేశారు. పనులు పూర్తయ్యేవరకూ నీటిని నిల్వ చేసే పరిస్థితి కూడా లేదు. ఇప్పుడిదే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కలవరానికి గురి చేస్తున్నది. ప్రస్తుతమున్న నీటి నిల్వలు ప్రతిపాదిత ఆయకట్టుకు సరిపోవు. మరోవైపు లిఫ్ట్ చేసుకునే సౌలభ్యం కూడా లేదు. దీంతో ఆయకట్టుకు నీరివ్వలేమని ప్రభుత్వం చేతులెత్తేస్తున్నది.

ఆరుతడికి మాత్రమే

రాష్ట్రంలో గత మూడేండ్లుగా మేజర్, మీడియం ప్రాజెక్టుల కిందనే ఏటా దాదాపు 35 లక్షలకు పైగా ఎకరాలకు సాగునీటిని అందించగా, ఈ ఏడాది అది 28 లక్షల ఎకరాలకే పరిమితమైంది. అందులో యాసంగిలోనూ వెట్ క్రాప్స్‌కు ఎక్కువగా సాగునీటిని అందించారు. ఈ ఏడాది మాత్రం పూర్తిగా ఆరుతడి పంటలకే ప్రాధాన్యమిచ్చారు. 2021-22 యాసంగిలో దాదాపు 19.81 లక్షల ఎకరాల్లో తరి పంటలకు సాగునీటిని అందించగా, ఈ ఏడాది దానిని 11.57 లక్షల ఎకరాలకు కుదించారు. అదే సమయంలో గత ఏడాది యాసంగిలో కేవలం 13.84 లక్షల ఎకరాల్లో ఆరుతడి పంటలకు సాగునీటిని అందించాలని నిర్ణయించగా, ఈ ఏడాది ఏకంగా 17.38 లక్షల ఎకరాలకు విస్తరించారు.

నాగార్జున్‌సాగర్ కింద ఆయకట్టు నిల్

ఈ ఏడాది కృష్ణా బేసిన్‌కు ఆశించిన స్థాయిలో వరద రాలేదు. దీంతో జూరాల మినహా దిగువన శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు ప్రస్తుతం వెలవెలబోతున్నాయి. దీంతో ఆయా ప్రాజెక్టుల కింద ఈ ఏడాది యాసంగి సీజన్‌లో ఆయకట్టుకు సాగునీరిచ్చే పరిస్థితి లేదని అధికారులు తేల్చారు. సాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 130.61 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అందులో 105.70 టీఎంసీలు మాత్రమే తెలంగాణ వాటాగా కేటాయించారు. ఈ నేపథ్యంలో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేకపోవడంతో సాగర్ ఎడమ కాలువ కింద ఆయకట్టుకు యాసంగి సీజన్‌లో నీరివ్వలేమని అధికార యంత్రాంగం తేల్చింది. ఎడమ కాలువ కింద మొత్తంగా 6.40 లక్షల ఎకరాలు ఉండగా, ఈ యాసంగిలో ఒక్క ఎకరాకూ నీరివ్వడం లేదు. శ్రీశైలం ప్రాజెక్టులో కూడా 57 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు, కల్వకుర్తి ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు కూడా యాసంగి సీజన్‌లో సాగునీరివ్వలేని పరిస్థితి నెలకొన్నది. కేవలం నెట్టెంపాడు కింద 5 వేల ఎకరాలకు, మూసీ ప్రాజెక్టు కింద 30 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరివ్వాలని అధికారులు ప్రతిపాదించారు.





గోదావరి బేసిన్‌లో (నీటి నిల్వ టీఎంసీల్లో)

ప్రాజెక్టు	పూర్తి సామర్థ్యం	గతేడాది	ప్రస్తుతం
శ్రీరాంసాగర్	90	72.91	63.19
శ్రీరాజరాజేశ్వర జలాశయం	27.50	24.78	16.34
లోయర్ మానేర్‌డ్యాం	24	16.34	24.78
ఎల్లంపల్లి	20	14.05	18.93
సింగూరు	29.17	24.55	26.76
నిజాంసాగర్	17.80	14.59	13.34
కడెం	7.60	6.14	3.9
మొత్తం	216.07	173.36	167.24

ప్రాజెక్టుల వారీగా యాసంగి సాగువిస్తీర్ణం (ఎకరాల్లో)

ప్రాజెక్టు	2023-24యాసంగి
భారీ ప్రాజెక్టులు	18,68,883
మధ్యతరహా ప్రాజెక్టులు	2,18,535
మైనర్ ప్రాజెక్టులు	6,72,938
ఐడీసీ	1,35,223
మొత్తం	28,95,579

భారీ ప్రాజెక్టుల కింద ఈ ఏడాది ఆయకట్టు ప్రతిపాదన

ప్రాజెక్టు	2022-23	2023-24 యాసంగి తైబందీ
ఎస్సారెస్పీ స్టేజీ 1	8,32,027	8,28,297
ఎస్సారెస్పీ స్టేజీ 2	3,71,096	1,26,914
మధ్యమానేరు	54,224	54,224
కడెం	15,227	0
అలీసాగర్	44,755	48,282
గుత్ప	36,100	33,725
నిజాంసాగర్	1,15,825	1,24,825
జూరాల	34,900	23,346
ఆర్డీఎస్	34,000	0
నాగార్జునసాగర్	5,99,233	0
మూసీ	30,000	30,000
సింగూరు	40,000	37,500
దేవాదుల	1,74,981	2,02,400
నెట్టెంపాడు	39,986	5,000
కల్వకుర్తి	2,64,000	0
ఏఎమ్మార్పీ, ఎస్ఎల్‌బీసీ	2,55,646	0

గత ఏడాదితో పోల్చితే ప్రాజెక్టుల కింద యాసంగి సాగు (ఎకరాల్లో..)

క్యాటగిరీ	2021-22	2022-23	2023-24
వెట్‌క్రాప్స్	11,95,256	19,81,301	11,57,014
ఆరుతడి	22,32,433	13,84,291	17,38,565
మొత్తం	34,27,689	33,65,592	28.95,579 (215టీఎంసీలు)

సీఎం రేవంత్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర మంతటా సంక్షేమంతో పాటు అభివృద్ధి వెలుగులు విరజిమ్మాలని ఆకాంక్షించారు. భోగభాగ్యాలను అందించే భోగి, కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి, కనుమ పండుగలు.. ఆనందంగా జరుపుకోవాలని కోరారు. సకల జన హితానికి, ప్రగతి పథానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని సీఎం హామీ ఇచ్చారు.

నిజామాబాద్ నుంచి కవిత పోటీ చేయాలి

- నుడా మాజీ చైర్మన్ చామకూర ప్రభాకర్‌రెడ్డి

ఖలీల్‌వాడి, జనవరి 13: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పోటీ చేయాలని నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) మాజీ చైర్మన్ చామకూర ప్రభాకర్‌రెడ్డి కోరారు. స్థానిక సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న ఉద్యమ నాయకురాలు నిజామాబాద్ నుంచి పోటీ చేసి గెలిస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిందని, ఆ పార్టీ ఇచ్చిన హామీల అమలుకు ప్రజల తరపున పోరాటం చేస్తామని చెప్పారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ కవిత నిజామాబాద్ నుంచి పోటీ చేయాలన్నది పార్టీ కార్యకర్తలుగా, ఉద్యమకారులుగా తమ కోరిక అని ఆయన పేర్కొన్నారు. 2014లో ఎంపీగా ఎన్నికైన కవిత.. రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, పసుపు బోర్డు, కేంద్రీయ విద్యాలయాలు, మెడికల్ కళాశాల వంటి వాటి కోసం పార్లమెంట్‌లో గళం విప్పారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నేతలు సుజిత్‌సింగ్ ఠాకూర్, ఎనుగందుల మురళి, కరిపె రాజు, సత్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు 'భరోసా' ఎట్లిస్తరు?

- కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజభీమ్‌రెడ్డి ప్రశ్న

హైదరాబాదర్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): రైతులందరికీ రూ. 15 వేల ఆర్థిక సాయాన్ని అందిస్తామన్న కాంగ్రెస్ పార్టీ కౌలు రైతులను ఏవిధంగా గుర్తిస్తుందని సినీహీరో, రచయిత రాజభీమ్‌రెడ్డి ప్రశ్నించారు. ఓ వెబ్ చానల్ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. రైతుభరోసా ద్వారా రైతులకు రూ.15 వేలు ఇస్తామన్న హామీని ఇప్పటివరకు అమలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కౌలు రైతులకు మాత్రమే రైతుభరోసా ఇవ్వాలని రేవంత్‌రెడ్డి సర్కారు యోచిస్తున్నదని, అయితే క్షేత్రస్థాయిలో భూమి యజమానులెవరూ కౌలు రైతులతో ఒప్పందం చేసుకోరని ఆయన స్పష్టం చేశారు.

ఆ ఫార్మాసిటీ వద్దు

మొదటిపేజీ తరువాయి...

ఒకే చోట 20వేల ఎకరాలలో ఫార్మాసిటీని నిర్మించాలన్న ప్రతిపాదనకు విరుద్ధంగా రేవంత్ తన నిర్ణయాన్ని వెల్లడించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన ముఖ్యమంత్రి తాము హైదరాబాద్ ఫార్మా సిటీని రద్దు చేయడం లేదని స్పష్టం చేశారు. మరోవైపు తాము 500 నుంచి వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తామని, వాటి చుట్టూ నివాస స్థలాలు, పాఠశాలలు, కాలేజీలు, దవాఖానలు, ఆహార విక్రయ కేంద్రాలు ఉంటాయని అన్నారు. ఒక్కో ఫార్మా విలేజ్‌లో 10 ఫార్మా కంపెనీలు ఉంటాయని తెలిపారు. తాజాగా ఆయన కేంద్రం ముందు మరో కొత్త పారిశ్రామిక కారిడార్‌ను ప్రతిపాదించడంతో పాటు ఫార్మాసిటీకి కూడా మరో ప్రతిపాదన చేస్తామని చెప్పడం గమనార్హం. హైదరాబాద్ వయా మిర్యాలగూడ -విజయవాడ నూతన పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రికి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీంతో ఈ కొత్త కారిడార్‌లోనే ఫార్మా సిటీకి సంబంధించిన ప్రతిపాదన చేస్తారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

తెలంగాణకు లెదర్ పార్క్ మంజూరు చేయండి

హైదరాబాద్ -నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌కు కేంద్ర ప్రభుత్వం తుది అనుమతులు మంజూరు చేయాలని, దీనివల్ల రాష్ట్రానికి రూ. 2,300 కోట్లు విడుదలవుతాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌కు నేషనల్ డిజైన్ సెంటర్ (ఎన్ఐడీ) మంజూరైందని, నాటి కేంద్రమంత్రి ఆనంద్‌శర్మ దానికి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. అయితే, రాష్ట్ర విభజన తర్వాత ఎన్ఐడీని విజయవాడకు తరలించారని, ఈ నేపథ్యంలో తెలంగాణకు మరో ఎన్ఐడీ మంజూరు చేయాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం నెల్లూరు జిల్లాకు మెగా లెదర్ పార్క్ మంజూరు చేసిందని గుర్తుచేస్తూ.. తెలంగాణలో కరీంనగర్, జనగాం జిల్లాల్లో లెదర్ పార్క్ ఏర్పాటుకు అవసరమైన భూములున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మెగా లెదర్ పార్క్ మంజూరు చేస్తే వెంటనే భూమి కేటాయిస్తామని తెలిపారు. దీనిపై కేంద్రమంత్రి స్పందిస్తూ, ఇది మంచి ప్రతిపాదన అని, ఇందుకు సంబంధించిన అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.

రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వండి

కేంద్ర ప్రభుత్వ పథకాల నుంచి రాష్ట్రానికి రావల్సిన నిధులు విడుదల చేయాలని, రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని సీఎం కోరారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖకు కేంద్రం నుంచి రావాల్సిన రూ. 4,256 కోట్ల ధాన్యం సబ్సిడీ నిధులను ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణ, యాసంగి బాయిల్డ్ రైస్ సమస్య, సీఎమ్మార్ గడువు పెంపు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో కేంద్ర పరిశ్రమల శాఖ సంయుక్త కార్యదర్శి బాలాజీ, కేంద్ర జౌళిశాఖ అదనపు కార్యదర్శి రోహిత్ కన్సల్, రాష్ట్ర జౌళి, చేనేత శాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి, టీఎస్ఐఐసీ సీఈవో మధుసూదన్, ఢిల్లీ తెలంగాణ భవన్ ఓఎస్డీ సంజయ్ జాజు, రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులపై అధిష్ఠానంతో చర్చ

అంతకుముందు సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటా, గవర్నర్ కోటా ఎమ్మెల్సీల అభ్యర్థుల ఎంపికకు సంబంధించి చర్చించినట్టు తెలిసింది. ముందుగా ఎమ్మెల్యే కోటా ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చిన నేపథ్యంలో ఎవరిని అభ్యర్థులుగా ప్రకటించాలనే అంశంపై చర్చించారు. ఇప్పటికే ఇద్దరు అభ్యర్థుల ఎంపికపై ఓ అంచనాకు వచ్చినట్టు తెలిసింది. ఇదిలా ఉంటే రెండో విడత భారత్ జోడో న్యాయ యాత్రను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదివారం మణిపూర్ నుంచి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు హాజరుకానున్నారు. అనంతరం సీఎం తిరిగి రాష్ట్రానికి రానున్నారు.

టెక్స్‌టైల్ పార్క్‌ను గ్రీన్‌ఫీల్డ్‌కు మార్చండి

కేంద్ర ప్రభుత్వం పీఎం మిత్ర పథకంలో భాగంగా వరంగల్‌లోని మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు బ్రౌన్ ఫీల్డ్ హోదా ఇచ్చిందని, దానికి గ్రీన్‌ఫీల్డ్ హోదా ఇవ్వాలని కేంద్రమంత్రిని సీఎం అభ్యర్థించారు. గ్రీన్‌ఫీల్డ్‌కు మార్చితే పార్క్‌కు గ్రాంట్ల రూపంలో అదనంగా రూ.300 కోట్ల నిధులు వస్తాయని, ఇది అక్కడి పరిశ్రమలకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. టెక్నికల్ టెక్స్‌టైల్స్ (బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, కన్వేయర్ బెల్టులు, ఎయిర్ బ్యాగ్‌లు తదితరాలు) టెస్టింగ్ సెంటర్ల ఏర్పాటుకు సుముఖంగా ఉన్నామని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో తెలంగాణకు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ టెక్నికల్ టెక్స్‌టైల్స్ /టెస్టింగ్ సెంటర్‌ను మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఏడు చేనేత క్లస్టర్స్ ఉన్నాయని తెలుపుతూ.. తెలంగాణకు జాతీయ చేనేత సాంకేతిక కేంద్రం(ఐఐహెచ్‌టీ)ని మంజూరు చేయాలని విజ్ఞప్తిచేశారు. ఐఐహెచ్ మంజూరు చేస్తే నేత కార్మికులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ఆదాయాలు పెంచుకునేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.

అన్నారం బరాజ్‌లో సీపేజ్‌లకు కెమికల్ ట్రీట్‌మెంట్ చేస్తున్న ఆప్కాన్స్ సంస్థ నిపుణులు

అన్నారం బరాజ్‌లో 'గ్రౌటింగ్' ప్రారంభం

- ప్రత్యేక కెమికల్‌తో సీపేజ్‌లకు ట్రీట్‌మెంట్

జయశంకర్ భూపాలపల్లి, జనవరి 13 (నమస్తే తెలంగాణ): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అన్నారం బరాజ్‌లో సీపేజ్‌లకు మరమ్మతు పనులను నిర్మాణ సంస్థ ఆప్కాన్స్ శనివారం ప్రారంభించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం(సరస్వతి)బరాజ్‌లో గతేడాది అక్టోబర్‌లో భారీ వర్షాల కారణంగా 38, 28 బౌట్‌లెట్స్ వద్ద చిన్న చిన్న సీపేజ్‌లు ఏర్పడిన విషయం తెలిసిందే. అప్పుడే అప్రమత్తమైన అధికారులు స్టోన్, మెటల్, ఇసుకతో తాత్కాలిక ట్రీట్‌మెంట్ చేసి లీకేజీని అదుపు చేశారు. సీపేజ్ నుంచి ఇసుక బయటికి పోకుండా అడ్డుకున్నారు. ఇటీవల రాష్ట్ర మంత్రుల బృందం అన్నారం బరాజ్‌ను పరిశీలించి రెండు సీపేజ్‌లతో ప్రమాదమేమీ లేదని తేల్చింది. నిర్మాణ సంస్థతో గ్రౌటింగ్ చేయించాలని చెప్పి వెళ్లింది. దీంతో అన్నారం బరాజ్ నిర్మాణ సంస్థ ఆప్కాన్స్.. ప్రత్యేంగా హిమాచల్‌ప్రదేశ్ నుంచి హెలిక్యాప్టర్‌లో పాలీ యూరిత్రిన్ అనే కెమికల్‌ను తెప్పించి బరాజ్‌లోని 38వ బౌట్‌లెట్ వద్ద సీపేజ్‌కు గ్రౌటింగ్ పనులను ప్రారంభించింది. ఆప్కాన్స్ సంస్థకు చెందిన 25 మంది నిపుణులు పనుల్లో నిమగ్నమయ్యారు. అనంతరం 28వ బౌట్‌లెట్ వద్ద సీపేజ్‌కు గ్రౌటింగ్ చేస్తారు. సుమారు 15 రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది. గ్రౌటింగ్ తర్వాత బరాజ్‌లోని నీటిని బయటకు పంపి ప్రభుత్వం అప్పగించిన పార్సన్ అనే ఏజెన్సీతో ఇన్వెస్టిగేషన్ పనులు ప్రారంభిస్తారు.

పాలమూరుపై పీటముడి!

- అనుమతులు ఇచ్చినట్టే ఇచ్చి మెలిక
- ప్రత్యేక కమిటీని నియమించిన కేంద్రం
- ఆ కమిటీ నివేదిక సమర్పించిన తర్వాతే పర్యావరణ అనుమతులు వచ్చే అవకాశం
- అనుమతులివ్వాలని గతంలోనే ఈఏసీ సిఫారసు
- ఆగస్టు నుంచి కేంద్రం వద్దే దస్త్రం

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులపై మళ్లీ పీటముడి పడింది. ఈ అనుమతులను మంజూరు చేయాలని కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ పరిధిలోని ఎక్స్‌పర్ట్ అప్రయిజల్ కమిటీ (ఈఏసీ) గతంలోనే సిఫారసు చేసినప్పటికీ తాజాగా కేంద్రం మరో మెలిక పెట్టింది. ఈ ప్రాజెక్టుపై గతంలో ఎన్జీటీ విధించిన జరిమానా నిధుల వినియోగానికి ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసింది. అది తర్వాతే పాలమూరు ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది.

ఆగస్టు నుంచి కేంద్రం వద్దే దస్త్రం

పాలమూరు ప్రాజెక్టు పర్యావరణ అనుమతుల కోసం తెలంగాణ ప్రభుత్వం 34వ ఈఏసీ సమావేశం నుంచే తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఈ ప్రాజెక్టుపై సందేహాలను లేవనెత్తుతూ ఈఏసీ సభ్యులు ఒక దశలో పర్యావరణ అనుమతుల మంజూరును సైతం తిరస్కరించి, ప్రాజెక్టు ప్రతిపాదనలను పక్క